సాక్షి
అనకాపల్లి
శుక్రవారం, 26, సెప్టెంబర్, 2025



వసూలు చేసిన రూ.2 లక్షలు వెనక్కి!



- తన పేరు చెప్పొద్దంటూ వేడుకోలు?
- ఫిర్యాదుదారు బంధువు పోలీసు అధికారి ద్వారా రాయబారాలు!
- రోజుకో మలుపు తిరుగుతున్న అనకాపల్లి స్టేషన్ ఎపిసోడ్
- లోతుగా విచారణ చేపడుతున్న ఏసీబీ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అనకాపల్లి పోలీస్ స్టేషన్‌లోనే వసూళ్ల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఓ కేసులో నగదు తీసుకుంటూ ఎస్‌ఐ ఏసీబీకి చిక్కగా... స్టేషన్‌లో తీసుకున్న రూ.2 లక్షలు కాస్తా ఎవరి జేబులోకి వెళ్లాయనే కోణంలో ఏసీబీ విచారణ చేపట్టింది. ఇందుకోసం స్టేషన్ సీసీ పుటేజీని ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు.. అంతిమ లబ్ధిదారు ఎవరనే కోణంలో విచారణ ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది. అయితే రూ.2 లక్షల వ్యవహారం బయటపొక్కకుండా ఉండేందుకుగానూ.. తన జేబులోకి వేసుకున్న వ్యక్తి కాస్తా తిరిగి ఫిర్యాదుదారుడికి వెనక్కి ఇచ్చినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా సదరు ఫిర్యాదుదారుడికి దూరపు బంధువైన ఓ పోలీసు అధికారి ద్వారా రాయబారం నడుపుతున్నట్టు కూడా ప్రచారం జరుగుతోంది. తనకు రూ.2 లక్షలు ఇచ్చినట్టు చెప్పవద్దంటూ బతిమలాడుకుంటున్నట్టు సమాచారం. మరోవైపు ఏసీబీ కేసులో అరెస్టయి జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన ఎస్‌ఐ కాస్తా... తిరిగి త్వరలోనే తనకు లా అండ్ ఆర్డర్ పోస్టింగు వస్తుందంటూ ప్రచారం చేసుకుంటుండటం ఇప్పుడు అనకాపల్లిలో హాట్‌టాపిక్‌గా మారింది.

పేరు చెప్పొద్దు ప్లీజ్..!

వాస్తవానికి ఈ కేసు వ్యవహారంలో ఎంత మొత్తం తీసుకోవాలనే డైరెక్షన్ మొత్తం ఎస్‌ఐ వెనుక ఉండి 'విజయ'వంతంగా నడిపించిన వ్యక్తి ఇప్పుడు తన పేరు బయటకు రాకుండా జాగ్రత్తలో పడినట్టు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా ఫిర్యాదుదారుడితో రాయబారాలు నడిపినట్టు కూడా సమాచారం. ఈ వ్యవహారంలో తనకు సహాయంగా ఉండేందుకు సదరు ఫిర్యాదుదారుడికి దూరపు బంధువైన ఓ సీఐ సహాయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందుకుగానూ రూ.2 లక్షలు వెనక్కి ఇవ్వడంతో పాటు నమోదైన కేసు వ్యవహారంలోనూ సహాయం చేస్తానని హామీ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఏసీబీకి ఇచ్చిన ఫిర్యాదులో ఇప్పటికే రూ.2 లక్షలు అందజేసినట్టు స్పష్టంగా పేర్కొన్న ఫిర్యాదుదారుడు.. అంతిమంగా ఎవరికోసం ఇచ్చారనేది ఇప్పటి వరకు వెల్లడించలేదని తెలుస్తోంది. ఇదే అదునుగా తన పేరు చెప్పకుండా ఉండాలంటూ తీసుకున్న రూ.2 లక్షలు తిరిగి వెనక్కి ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ విషయం బయటకు రాకుండా నగదు రూపంలో సదరు బంధువు ద్వారా లావాదేవీలు చేసినట్టు సమాచారం. ఈ వ్యవహారాన్ని కూడా ఏసీబీ లోతుగా విచారణ జరుపుతున్నట్టు తెలుస్తోంది.

ఎమ్మెల్యే బంధువని తెలిసినా..!

వాస్తవానికి బంగారం షాపు యజమాని స్థానిక ఎమ్మెల్యే బంధువు అని తెలుస్తోంది. తన షాపులోనికి రంధ్రం చేసుకుని వచ్చేందుకు ప్రయత్నించారని.. స్వయంగా సదరు బంధువు వెళ్లి కేసు నమోదు చేయాలంటూ కోరారు. అయితే దొంగతనం ఏమీ జరగలేదు కదా అంటూ.. వెంటనే కేసు నమోదు చేయకుండా తాత్సారం చేసినట్టు తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే అల్లుడు కూడా ఫోన్ చేసి విచారణ చేయాలంటూ కోరినట్టు సమాచారం. అయినప్పటికీ అవతలి పార్టీ నుంచి లంచం తీసుకుని తాత్సారం చేసినట్టు తెలుస్తోంది. ఒక ఎమ్మెల్యే బంధువు వ్యవహారంలోనే పోలీసులు ఇంత ఉదాసీనంగా కేసు పెట్టకుండా అవతలి వ్యక్తుల నుంచి పైసలు తీసుకున్నారంటే పోలీసింగ్ పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా ఏసీబీ కేసులో ఇరుక్కున్న ఎస్‌ఐ తనకు తిరిగి లా అండ్ ఆర్డర్‌లో పోస్టింగు వస్తుందంటూ.. ఇందుకోసం సిటీలోని ఓ టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే తనకు అండదండలందిస్తున్నట్టు కూడా ప్రచారం చేసుకుంటుండడం గమనార్హం.

వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్తగా బొడ్డేడ ప్రసాద్



సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్తగా బొడ్డేడ ప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా పనిచేస్తున్న బొడ్డేడ ప్రసాద్ ఆ పదవిలో కూడా కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆయన వైఎస్సార్ హయాంలో ఆర్ఈసీఎస్ చైర్మన్‌గా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు.

ఆక్సిజన్ పెట్టేవారు లేరు
- ఏయూ ఆరోగ్య కేంద్రానికి నుస్తీ

10లో

స్వచ్ఛతతో ఆరోగ్యం, ఆనందం

తుమ్మపాల: ప్రతి ఒక్కరూ తమ ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛత కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. పిసినికాడ శ్మశాన వాటికలో గురువారం 'స్వచ్ఛత హి సేవ'లో భాగంగా నిర్వహించిన ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ స్వచ్ఛత కార్యక్రమంలో ఆమె పారిశుధ్య కార్మికులతో కలిసి పరిసరాలు, కాలువలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో కూడా శ్రమదానం చేసి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండగలమని, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామంలో వెంటనే ట్రాక్టర్ తొట్టి కొనుగోలు చేసి వినియోగంలోకి తీసుకురావాలని, డంపింగ్ యార్డ్ వద్ద చెత్త నిలువ ఉండకూడదని, ఎప్పటికప్పుడు తరలించాలని ఆదేశించారు. ఆర్డీవో షేక్ ఆయిషా, సర్పంచ్ రమేష్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



పిసినికాడ గ్రామంలో పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్తను తొలగిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

రూ.1.55 లక్షలకు లడ్డూ వేలం

చీడికాడ: అర్జునగిరి గ్రామంలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో భవానీ భక్తులు ఏర్పాటు చేసిన శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని ప్రతిష్ఠించారు. అమ్మవారి లడ్డును గ్రామానికి చెందిన కొప్పాక శ్రీనివాసరావు దంపతులు లక్షా 55 వేల రూపాయలకు వేలంలో సొంతం చేసుకున్నారు. ఈ నగదును వచ్చే ఏడాది జరిగే శరనవరాత్రి ఉత్సవాల్లో అంబలం పూజకు వినియోగించనున్నట్టు అమ్మవారి పీఠం గురు భవానీ భక్తులు తెలిపారు. కాగా అమ్మవారి అంబలం పూజ బుధవారం రాత్రి జరిగింది. భక్తుల ఆర్థిక సహకారంతో 50 కిలోల లడ్డూను ఏర్పాటు చేశారు.



వేలంలో దక్కించుకున్న లడ్డు

చల్లారని ఆగ్రహం



రోడ్డుపై బైఠాయించిన మత్స్యకారులు



నిరాహార దీక్షకు మద్దతుగా తరలివచ్చిన మహిళలు

- రాత్రంతా కొనసాగిన దీక్ష.. 11వ రోజూ మత్స్యకారుల నిరశన
- అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యాక వస్తానని హోంమంత్రి వీడియో సందేశం
- అయినా ఆందోళన కొనసాగింపు

నక్కపల్లి: బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ బుధవారం రాత్రంతా ఆందోళన కొనసాగించిన రాజయ్యపేట మత్స్యకారులు 11వ రోజైన గురువారం కూడా నిరశన చేపట్టారు. తమ ఆవేదనకు హోం మంత్రి అనిత స్పందించకపోగా.. ఆర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంటు ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలంటూ నక్కపల్లిలో సమావేశం ఏర్పాటు చేయడంతో మత్స్యకారులు అగ్గి మీద గుగ్గిలమయిన విషయం తెలిసిందే. బుధవారం సాయంత్రం రాజయ్యపేటలో జరుగుతున్న పనులను అడ్డుకుని రోడ్డుపై నిప్పు పెట్టి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. తెల్లవార్లూ అక్కడే ఆందోళన చేసి, గురువారం ఉదయం నుంచి నిరాహార దీక్ష కొనసాగించారు. పూరీ, కోణార్క్ వంటి ప్రాంతాలకు వలస వెళ్లిన వందలాది మంది మత్స్యకారులు రైళ్లలో, బస్సుల్లో స్వగ్రామానికి తిరిగి వచ్చి వారితో గొంతు కలిపారు. అక్కడే వంట వార్పు చేసుకొని, దీక్షలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు తదితరులు సంఘీభావం ప్రకటించి, వారితోపాటు సాయంత్రం వరకు నిరాహార దీక్షలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా భారీగా పోలీసులు మోహరించారు.

అధికారులు నచ్చచెప్పినా ససేమిరా

నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, డీఎస్పీ శ్రీనివాసరావు, మత్స్యశాఖ ఏడీ విజయలక్ష్మి వచ్చి చర్చలు జరిపేందుకు సిద్ధపడగా, మత్స్యకారులు అంగీకరించలేదు. మీతో మాకు సంబంధం లేదని, హోం మంత్రి వచ్చి సమాధానం చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. పది రోజుల నుంచి నిద్రాహారాలు మాని ఆందోళన చేస్తే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు అనిపించలేదని మత్స్యకార నాయకులు మోసా అప్పలరాజు, గోసల రాజశేఖర్, పిక్కి తాతీలు, ఎరిపల్లి నాగేశు, మహేష్ కాశీరావు, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ తదితరులు విమర్శించారు. సహనాన్ని పరీక్షిస్తే ప్రాణాలను సైతం లెక్క చేయమన్నారు. జైళ్లకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు.

వీసం రామకృష్ణ మాట్లాడుతూ మత్స్యకారులు చేసే పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, వారితోపాటు ఎన్ని రోజులైనా నిరాహార దీక్షలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీపీఎం జిల్లా నాయకుడు అప్పలరాజు మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్కు వల్ల ఇబ్బంది ఉండదని టీడీపీ నాయకులు, అధికారులు చెబుతున్నారని, అచ్యుతాపురం, పరవాడలలో ఇటువంటి పార్కులు ఉన్నాయని, అక్కడ ఒక గ్రామాన్ని ఎంపిక చేసి పరిశీలన చేద్దామని, ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవని చెబితే స్వచ్ఛందంగా ఆందోళన విరమిస్తామన్నారు.

హోం మంత్రి వీడియో ప్రకటన

సాయంత్రం హోం మంత్రి అనిత వీడియో ద్వారా ప్రకటన విడుదల చేశారు. తాను అసెంబ్లీ సమావేశాల్లో ఉండటం వల్ల రాజయ్యపేట రాలేకపోయానన్నారు. సమావేశాలు ముగిసిన వెంటనే వచ్చి చర్చలు జరుపుతానన్నారు, వారి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. మంత్రి మాట్లాడిన వీడియోను ఆర్డీవో రమణ ఆందోళనకారులకు వినిపించారు. దీంతో మత్స్యకారులు రోడ్డుపై నుంచి ఆందోళనను నూకతాత ఆలయానికి మారుస్తున్నామని, అక్కడ ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసుకొని దీక్ష కొనసాగిస్తామన్నారు. తమ డిమాండ్లు పూర్తిగా నెరవేర్చి సంతృప్తి చెందితేనే ఆందోళన విరమిస్తామని, పరిష్కారం కాకపోతే నిరాహార దీక్ష మరింత ఉధృతం చేస్తామన్నారు.

'తాచేరు'లో మృత్యుఘోష

ప్రభుత్వ నిర్లక్ష్యం మరొకరిని బలి కోరింది. తాచేరు నదిలో మునిగి రెండు రోజుల్లో ఇద్దరు నీటి పాలయ్యారు. మంగళవారం సాయంత్రం కొట్టుకుపోయిన 13 ఏళ్ల బాలుడి మృతదేహం బుధవారం లభ్యమయింది. అదే రోజు రాత్రి వ్యవసాయ పనులకు వెళ్లిన వృద్ధ రైతు గురువారం ఉదయం శవమై తేలాడు.



డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రమాదకరంగా తయారైన తాచేరు నది (ఇన్‌సెట్) రైతు సుబ్బారావు మృతదేహం

రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి
ప్రాణాలు పోతున్నా చలనం లేని ప్రభుత్వం

బుచ్చెయ్యపేట: రోడ్డు కోతకు గురై రెండు నెలలైంది. మరమ్మతులకు రూ.15 లక్షలు మంజూరు కాగా ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు శంకుస్థాపన చేసి 20 రోజులు గడిచాయి. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. తరచుగా వర్షాలు పడడంతో నీటి ఉధృతి పెరిగి ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడింది. విజయరామరాజుపేట తాచేరు నదిలో పడి బుధవారం రాత్రి వడ్డాదికి చెందిన రైతు కాళ్ల సుబ్బారావు (74) మృతి చెందారు. రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఈ ప్రాంతీయులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో విజయరామరాజుపేట తాచేరు నదిపై డైవర్షన్ రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయి గండి పడిన విషయం తెలిసిందే. రోడ్డు కోతకు గురై సుమారు రెండు నెలలవుతోంది. ఈ రహదారిలో రాకపోకలు సాగించే విశాఖ, అనకాపల్లి, పాడేరు, నర్సీపట్నం, చోడవరం తదితర ప్రాంతాల ఆర్టీసీ బస్సులతోపాటు ఇతర వాహనాలు పూర్తిగా ఆగిపోయాయి. మరమ్మతులకు నిధులు మంజూరైనా తాచేరు డైవర్షన్ రోడ్డు పనులు జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీఎన్ రోడ్డును బాగు చేయలేదని, కనీసం గోతులను పూడ్చలేదని ఎన్నికల ముందు కూటమి నేతలు విమర్శలు చేశారు. గత ప్రభుత్వంలోనే బీఎన్ రోడ్డులో గంధవరం నుంచి రోలుగుంట వరకు రహదారి విస్తరణకు అప్పటి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కృషితో రూ.78 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు కాంట్రాక్ట్ పనులు దక్కించుకున్న టీడీపీ నాయకుడు పనులు సగంలో వదిలేశాడు. అధికారంలోకి వస్తే ముందుగా బీఎన్ రోడ్డునే బాగు చేసి రవాణా సదుపాయం కల్పిస్తామని, అవసరమైతే సొంత నిధులతోనైనా రోడ్డు పనులు చేసి తరవాత నిధులు రాబట్టుకుంటామని కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో ప్రకటనలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే రాజు విజయరామరాజుపేట తాచేరు వంతెన వద్దకు వచ్చి గత ప్రభుత్వంలోనే బీఎన్ రోడ్డు విస్తరణకు, వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనందున వెంటనే పనులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నరైనా కనీసం కోతకు గురైన డైవర్షన్ రోడ్డు మరమ్మతు పనులు చేయలేదు. ఇప్పటికీ మూడు జిల్లాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇద్దరి ప్రాణాలు పోయినా.. పలువురు తాచేరు నదిలోకి దిగి ప్రమాదాలకు గురవుతున్నా ప్రభుత్వం, నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

వడ్డాదిలో విషాదఛాయలు



సుబ్బారావు (ఫైల్)

తాచేరు నదిలో పడి వడ్డాదికి చెందిన కాళ్ల సుబ్బారావు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వడ్డాది, విజయరామరాజుపేట రెండు గ్రామాలు పక్కపక్కనే ఉంటాయి. రెండు గ్రామాల మధ్యన తాచేరు నది ఉంది. నదిని ఆనుకొని రెండు గ్రామాల రైతులకు పంట పొలాలున్నాయి. బుధవారం తాచేరు నది దాటి తన పొలంలోకి వెళ్లిన సుబ్బారావు రాత్రయినా తిరిగి ఇంటికి రాలేదు. తాచేరు నది డైవర్షన్ రోడ్డు కోతకు గురవడంతో నది దాటలేక పొలంలో పాకలో ఉండిపోయి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. బుధవారం ఉదయం డైవర్షన్ రోడ్డు వద్ద సుబ్బారావు మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ శ్రీనివాసరావు పరిశీలించారు. సుబ్బారావు మృతదేహాన్ని నీటిలో నుంచి బైటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మితోపాటు వివాహమైన ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

క్లుప్తంగా

భవానీ భక్తులకు ప్రత్యేక బస్సులు


డిపో మేనేజర్ ధీరజ్

నర్సీపట్నం: విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భవానీ భక్తుల కోసం ప్రత్యేకంగా బస్సులు నడుపుతామని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.ఎస్.ఎస్. ధీరజ్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఐదు రూటుల్లో ఈ బస్సులు నడుపుతున్నామన్నారు. నర్సీపట్నం నుంచి విజయవాడ వెళ్లి రావడానికి పల్లె వెలుగు రూ.800, అల్ట్రా పల్లె వెలుగు రూ.900, ఎక్స్‌ప్రెస్ రూ.వెయ్యి, అల్ట్రా డీలక్స్ రూ.1250గా టికెట్ ధర నిర్ణయించామన్నారు. ద్వారపూడి మీదుగా వెళ్లి రావడానికి పల్లె వెలుగు రూ.860, అల్ట్రా పల్లె వెలుగు రూ.970, ఎక్స్‌ప్రెస్ రూ.1070, అల్ట్రా డీలక్స్ రూ.1350, ద్వారపూడి, ద్వారకా తిరుమల మీదుగా వెళ్లి రావడానికి పల్లె వెలుగు రూ.910, అల్ట్రా పల్లె వెలుగు రూ.1030, ఎక్స్‌ప్రెస్ రూ.1140, అల్ట్రా డీలక్స్ రూ.1420 చార్జి చేస్తామన్నారు. ద్వారపూడి, గొల్లలమామిడాడ, ద్వారకా తిరుమల మీదుగా వెళ్లి రావడానికి పల్లె వెలుగు రూ.970, అల్ట్రా పల్లె వెలుగు రూ.1090, ఎక్స్‌ప్రెస్ రూ.1210, అల్ట్రా డీలక్స్ రూ.1510, భద్రాచలం మీదుగా విజయవాడ వెళ్లి ద్వారపూడి మీదుగా తిరిగి రావడానికి పల్లె వెలుగు రూ.1190, అల్ట్రా పల్లె వెలుగు రూ.1340, ఎక్స్‌ప్రెస్ రూ.1490, అల్ట్రా డీలక్స్ రూ.1850గా రేట్లు నిర్ణయించామన్నారు. 50 మంది భవానీ భక్తులు ఉంటే నర్సీపట్నం పరిసర గ్రామాల నుంచే నేరుగా బస్సులు నడుపుతామని తెలిపారు. ఆసక్తిగల వారు 9493211969, 949811855 నంబర్లను సంప్రదించాలని డిపో మేనేజర్ కోరారు.

విజిలెన్స్ అవగాహన వాకథాన్

సీతంపేట (విశాఖ): సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం విజిలెన్స్ అవగాహన వాకథాన్, సముద్రతీర శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. తొలుత ద్వారకానగర్‌లో ఉద్యోగులు, స్వచ్ఛంద కార్యకర్తలు విజిలెన్స్ వాక్‌థాన్‌లో పాల్గొని, పాలనలో జాగ్రత్త (విజిలెన్స్), పారదర్శకత ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఆర్కే బీచ్‌లో సముద్రతీర శుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ప్రధాన అధికారి ఏవీ రమణమూర్తి మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి జాగ్రత్త (విజిలెన్స్), శుభ్రత రెండూ తప్పనిసరి అని అన్నారు.

ఆక్సిజన్ పెట్టేవారు లేరు

- అందువల్లే బీఈడీ విద్యార్థి మృతి ?
- ఏయూ ఆరోగ్య కేంద్రానికి సుస్తీ
- వైద్యులు, సిబ్బంది లేక రోగుల అవస్థలు
- నిత్యం 200 మంది రోగులకు ఇద్దరే వైద్యులు
- 24 గంటల డిస్పెన్సరీకి ఇద్దరు నర్సులు, ఇద్దరు ఫార్మసిస్టులు


ఏయూ ఆరోగ్య కేంద్రం


అంబులెన్సులో పరిస్థితి


ఇవీ ఫార్మసీలో ఉన్న మందులు

విశాఖ సిటీ: శతాబ్ది ఉత్సవాలు చేసుకుంటున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆరోగ్య కేంద్రానికి సుస్తీ చేసింది. ఏటా వేలాది మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్న వర్సిటీ.. ఉద్యోగులు, విద్యార్థుల ఆరోగ్యాన్ని గాలికి వదిలేస్తోంది. ఏయూ పాలకుల నిలువెత్తు నిర్లక్ష్యం అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులకు ప్రాణ సంకటంగా మారింది. ఒకవైపు వందేళ్ల సంబరాలు చేసుకుంటున్న ఏయూలో డిస్పెన్సరీ 'ఊపిరి' తీసేస్తున్నారు. నిత్యం వందల మంది వచ్చే ఏయూ ఆరోగ్య కేంద్రంలో కనీస సౌకర్యాలతో పాటు వైద్యులు, సిబ్బంది లేకపోవడం రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన వైద్య సదుపాయం లేని కారణంగానే ఏయూలో బీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మణికంఠ మరణించాడని విద్యార్థుల చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటన ఏయూ పాలకుల నిర్లక్ష్యాన్ని మరోసారి బట్టబయలు చేసింది.

200 మంది రోగులు.. ఇద్దరే వైద్యులు

ఏయూలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర, ఇతర సిబ్బంది, విద్యార్థుల కోసం ఆరోగ్య కేంద్రం ఉంది. 24 గంటల పాటు ఇక్కడ వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ ఉంటుంది. ఈ సమయంలో రోజుకు 200 మంది వరకు రోగులు వస్తుంటారు. కానీ ఇక్కడ ఉన్నది కేవలం ఇద్దరు వైద్యులు మాత్రమే. వీరిద్దరే చాలా ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్నారు. మూడు షిఫ్టులు వైద్య సేవలు అందించే ఈ ఆస్పత్రిలో కేవలం ఇద్దరు నర్సులు మాత్రమే ఉన్నారు. అలాగే ఫార్మసిస్టులు ముగ్గురికి ఇద్దరు మాత్రమే ఉన్నారు. అలాగే ఒక్కో షిఫ్టులో ఒక వార్డుబాయ్ ఉంటున్నారు. వీరే మొత్తం పనిచేయాల్సి వస్తోంది. ఎవరు సెలవు పెట్టినా మిగిలిన వారిపై పనిభారం పడుతోంది. ప్రధానంగా ఆక్సిజన్ సిలిండర్లు ఆస్పత్రిలో ఒకటి, అంబులెన్సులో ఒకటి ఉన్నాయి. కానీ అంబులెన్సులో రోగిని తీసుకెళ్లడానికి సిబ్బంది వెళ్లే పరిస్థితి లేదు. రోగికి ఆక్సిజన్ పెట్టేందుకు వార్డుబాయ్ వెళితే.. ఆస్పత్రిలో రోగులకు సేవలు అందించడానికి ఎవరూ లేకుండా పోతున్నారు. ఇదే పరిస్థితి గురువారం ఎదురైంది. అస్వస్థతకు గురైన మణికంఠను అంబులెన్సులో ఆస్పత్రికి తరలించినప్పటికీ.. ఆక్సిజన్ పెట్టేందుకు సిబ్బంది లేరు. ఆక్సిజన్ పెట్టి ఉంటే మణికంఠ ప్రాణాలతో ఉండేవాడని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఇలా ఆస్పత్రిలో అనేక సమస్యలు తిష్టవేసుకొని కూర్చున్నాయి. ఇక్కడి పరిస్థితులు, అసౌకర్యాలు, సిబ్బంది లోటు వంటి విషయాలను ఏయూ పాలకుల దృష్టికి పలువురు తీసుకువెళ్లినా ఇప్పటి వరకు వాటిపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవు.

జీతాలు అరకొరే..

ఆస్పత్రిలో సిబ్బంది జీతాల పరిస్థితి కూడా దారుణంగా ఉన్నట్లు తెలుస్తోంది. దశాబ్దానికి పైగా పనిచేస్తున్న నర్సుకు ఇక్కడ కేవలం రూ.10 వేలు మాత్రమే ఇస్తుండడం గమనార్హం. అలాగే ఫార్మసిస్టులకు రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారు. జీతాలు పెంచాలని సిబ్బంది ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారిని పట్టించుకున్న వారే లేకుండా పోయారు. ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలని, సిబ్బందిని నియమించాలని గత ఏడాది కాలంగా పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


వివాదాల్లో ఏయూ..

ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వకళాపరిషత్‌ను ఇటీవల కాలంలో వివాదాలు చుట్టుముడుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏయూ ప్రతిష్ట దిగజారుతోంది. నిత్యం ఏదో ఒక వివాదంతో ఆందోళనకు, నిరసనలకు కేంద్రంగా మారుతోంది. పాలనపై ఆరోపణలు, విద్యార్థుల వసతి సౌకర్యాలపై విమర్శలు.. పురుగుల భోజనాలతో ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల కాలంలో ఏయూలో పరిస్థితులపై విద్యార్థులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎప్పటికప్పుడు ఏయూ వీసీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగుతున్నారు. నిత్యం ఏదో ఒక రగడతో ఏయూలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రతిసారి ఆందోళనల సమయాల్లో బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు తప్ప సమస్యలను పరిష్కరించడం లేదని విద్యార్థులు మండిపడ్డారు.

ముగ్గురు జీవీఎంసీ సిబ్బందిపై వేటు

మధురవాడ: విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఇన్‌చార్జ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌తో సహా మరో ఇద్దరు ప్లానింగ్ సెక్రటరీలపై సస్పెన్షన్ వేటు పడింది. వీరిలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అప్పలసూరి, ప్లానింగ్ సెక్రటరీలు అశోక్, రమేష్‌పై జీవీఎంసీ కమిషనర్ చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. జీవీఎంసీ 6వ వార్డు డి మార్టు వద్ద, మరో చోట అనధికారంగా నిర్మాణం చేస్తున్నా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వీరిపై అధికారులు చర్యలు చేపట్టారు.

అధినేతతో మర్యాదపూర్వక భేటీ



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్

పరిశ్రమల దరఖాస్తులను త్వరగా ఆమోదించాలి


డీఐఈపీసీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

- 46 భారీ, అతి భారీ పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలు
- రూ.2,89,161.85 కోట్ల పెట్టుబడులు, 1,56,556 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- డీఐఈపీసీ సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: పరిశ్రమల ఏర్పాటు ద్వారా పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి సత్వరమే అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) 16వ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పి.కె.పి. ప్రసాద్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.నరసింహారావు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత జులై 29న జరిగిన సమావేశం తరువాత నుంచి ఇప్పటి వరకు వివిధ శాఖల అనుమతి కోసం 1,573 దరఖాస్తులు రాగా, వాటిలో 1,462 దరఖాస్తులను ఆమోదించామన్నారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి మిగిలిన దరఖాస్తులను త్వరగా ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 12 పరిశ్రమలకు సంబంధించిన వివిధ రాయితీల కోసం 21 దరఖాస్తులు రాగా, రూ.7.46 కోట్ల విడుదలకు కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపామన్నారు. నక్కపల్లిలో కొత్తగా వరాహ పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అలాగే 46 భారీ, అతి భారీ పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలు వివిధ దశల్లో ఉన్నాయని, వీటి ద్వారా రూ.2,89,161.85 కోట్ల పెట్టుబడులు, 1,56,556 మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ముకుందరావు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల జాయింట్ డైరెక్టర్ సెంథిల్ కుమార్, ఫ్యాప్ షియా జిల్లా సమన్వయకర్త వై.సాంబశివరావు, జిల్లా కర్మాగారాల ఉప ముఖ్య ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్, జిల్లా నైపుణ్య అభివృద్ధి శాఖ అధికారి గోవిందరావు, విద్యుత్ శాఖ పర్యవేక్షణ ఇంజినీర్ ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్వీపీ కంటి వైద్యశాల పరిశోధకులకు అంతర్జాతీయ గౌరవం

ఆరిలోవ (విశాఖ): స్టాన్‌ఫర్డ్, ఎల్సెవియర్ విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా ఇటీవల విడుదల చేసిన ప్రపంచ స్థాయి ఉత్తమ పరిశోధకుల వార్షిక జాబితా–2025లో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు చెందిన మొత్తం 15 మంది వైద్యులు స్థానం పొందారు. ఈ విషయాన్ని కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వీరేంద్ర సహదేవ గురువారం తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని ఎల్వీపీ కేంద్రాలతో పాటు, విశాఖ ఎల్వీపీ కంటి ఆస్పత్రికి చెందిన వైద్య నిపుణులు కూడా ఈ జాబితాలో ఉన్నారు.

వ్యాన్ ఢీకొని బాలుడి మృతి


మృతి చెందిన జయంత్

మాడుగుల రూరల్: డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ముక్కు పచ్చలారని బాలుడి ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఈ దుర్ఘటనకు సంబంధించి ఎస్ఐ జి. నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాడుగుల జగ్గన్నచావిడి ప్రాంతానికి చెందిన గుంపాన జయంత్(7) జగ్గన్న చావిడి వద్ద గురువారం మధ్యాహ్నం రోడ్డు దాటుతుండగా చీడికాడ మండలం ఎల్.బి.పట్నం (బోయపాడు) నుంచి మాడుగుల జంక్షన్ వైపు వస్తున్న ఏపీ35 డబ్ల్యూ 3587 నంబరు గల టాటాఏస్ గూడ్స్ వ్యాన్ డ్రైవరు నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి జయంత్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో రోడ్డు మీద పడిపోయిన బాలుడి ఛాతీపై నుంచి వ్యాన్ టైరు వెళ్లిపోవడంతో అతని నోటి నుంచి రక్తస్రావం అయింది. వెంటనే కుటుంబ సభ్యులు సమీపంలో వున్న మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యాధికారి పరీక్షించి అప్పటికే జయంత్ చనిపోయినట్టు నిర్ధారించారు. మృతుడు తండ్రి అచ్యుతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అచ్యుతరావుకు ఇద్దరు కుమారులు కాగా, మృతుడు రెండో కుమారుడు రెండో తరగతి చదువుతున్నాడు. అచ్యుతరావు తాపీ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నారు. బాలుడి మృతదేహాన్ని గురువారం సాయంత్రం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టంకు పంపించినట్టు ఎస్ఐ తెలిపారు.

పలు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

- 8 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం


కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు, సిబ్బంది చోరీకి గురైన బంగారు నగలతో పట్టుకున్న నిందితుడు

కశింకోట: జిల్లాలో పలు దొంగతనాలకు పాల్పడిన దొంగను కశింకోట పోలీసులు చాకచక్యంగా పట్టుకొని 8 తులాల నగలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ అల్లు స్వామినాయుడు గురువారం రాత్రి విలేకరులకు వివరాలు తెలిపారు. మండలంలోని అచ్చెర్ల కూడలి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా పారిపోతున్న కోటవురట్ల మండలం రామచంద్రపాలెం గ్రామానికి చెందిన కరక రాజుబాబు(46)ను తమ సిబ్బంది సహకారంతో పట్టుకున్నామన్నారు. అతన్ని విచారించగా గతంలో సుమారు 30 దొంగతనాలు చేసి 15 దఫాలు జైలుకు వెళ్లినట్టు అంగీకరించారన్నారు. మాకవరపాలెం మండలం తామరం పీఏసీఎస్‌లో దొంగతనానికి ప్రయత్నించినట్లు తెలిపాడన్నారు. అలాగే ఈ ఏడాది జనవరి 27న కశింకోటలో జరిగిన 15 తులాల బంగారం దొంగతనాన్ని తానే చేసినట్టు అంగీకరించాడన్నారు. ఈ సందర్భంగా మధ్యవర్తుల సమక్షంలో నిందితుని బ్యాగు నుంచి 8 తులాల బరువు కలిగిన పలు బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుడిని విజయవంతంగా పట్టుకున్నందుకు తమను, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడి మృతి


మృతుడు అప్పికొండ కృష్ణ

అచ్యుతాపురం రూరల్: విద్యుత్ శాక్ గురై మునగపాక మండలం, అప్పికొండవానిపాలెం గ్రామానికి చెందిన అప్పికొండ కృష్ణ (25)మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు అప్పికొండ కృష్ణ వృత్తి రీత్యా రాడ్ బెండింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మండలంలో మడుతూరు పంచాయతీ ఎరికిరెడ్డిపాలెం గ్రామంలో ఒక ఇంటికి రాడ్ బెండింగ్ చేస్తుండగా జరిగిన ప్రమాదంలో బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ కేసు నమోదు చేసి పంచనామా నిమిత్తం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కేజీహెచ్‌లో సీబీఐ అధికారుల విచారణ

- విద్యార్థిని రీతి సాహా మృతి కేసులో కోర్టు ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు ప్రారంభం
- హాస్టల్ బిల్డింగ్ పైనుంచి పడి మృతి చెందిన రీతి సాహా
- ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేసిన తల్లిదండ్రులు
- సీబీఐ డిప్యూటీ సూపరింటెండెంట్ దినేష్‌కుమార్ నేతృత్వంలో నిపుణుల కమిటీతో భేటీ


విచారణ జరిపి వెళ్తున్న సీబీఐ డీఎస్పీ దినేష్ కుమార్

మహారాణిపేట(విశాఖ): విశాఖలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన పశ్చిమ బెంగాల్ విద్యార్థిని రీతి సాహా కేసుపై సీబీఐ ఆరా తీస్తోంది. గురువారం సీబీఐ డీఎస్పీ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో కేజీహెచ్‌లో విచారణ చేశారు. అనుమానాస్పద మృతి చెందడంతో అప్పట్లో నిపుణుల కమిటీ వేసి వారి చేత పోస్టుమార్టమ్ నిర్వహించారు. అప్పుడు కమిటీ సభ్యులు డాక్టర్ మమత, డాక్టర్ హయగ్రీవరావు, డాక్టర్ సత్యప్రసాద్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రజనీకాంతరావులు పోస్టుమార్టం జరిపారు. ఇందులో ఇద్దరు వైద్యులు మమత, రజనీకాంతరావులకు ఇటీవల బదిలీ అయ్యింది. మిగిలిన ముగ్గురు వైద్యులను గురువారం దినేష్‌కుమార్ విచారించారు. రికార్డులను, అప్పటి పోస్టుమార్టమ్ నివేదికలను పరిశీలించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన విద్యార్థిని నీట్ శిక్షణ కోసం విశాఖలో ఆకాష్ బైజూస్ కాలేజీలో చేరింది. 2023, జూలై 14న రాత్రి విశాఖ 4వ పట్టణ పోలీసుస్టేషన్ పరిధి దొండపర్తిలో కాలేజీ నిర్వహిస్తున్న సాధన హాస్టల్ భవనం పైనుంచి పడింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదే నెల 17న మృతి చెందింది. పోలీసులు తొలుత ఆమెది ఆత్మహత్యగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం ఉందని కాలేజీకి చెందిన ఇద్దరిని, హాస్టల్‌కు చెందిన మరో ఇద్దరిని అరెస్టు చేశారు. అయితే ఆమె మృతిపై తండ్రి సుఖ్‌దేవ్ సాహా మాత్రం అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసుల దర్యాప్తు తీరు సక్రమంగా లేదని, కాలేజీ యాజమాన్యంతో పోలీసులు కుమ్మక్కైపోయారని ఆరోపణలు చేశారు. అలాగే సీసీ కెమెరా పరిశీలిస్తే.. తన కుమార్తె బిల్డింగ్‌పైకి వెళ్లినపుడు ఒక కలర్ డ్రెస్ ఉందని, కింద పడిన తర్వాత మరో కలర్ డ్రెస్ ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

రంగంలోకి దిగిన సీబీఐ

అప్పట్లో విశాఖలో సంచలనం సృష్టించిన ఈ కేసులో విచారణ చేయడానికి సీబీఐ రంగంలోకి దిగింది. ఈ కేసు విషయంలో స్వయంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. దర్యాప్తు కోసం బెంగాల్ సీఐడీని విశాఖకు పంపించడం చర్చనీయాంశమైంది. తాజాగా ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడంతో మరోసారి దర్యాప్తు జరుగుతోంది.

సిటీ పోలీసులకు తలనొప్పులు

విద్యార్థిని మృతి కేసు విశాఖ పోలీసుల పరువు తీసినట్టయింది. ముందు ఆమెది ఆత్మహత్యగానే పేర్కొంటూ స్వయంగా అప్పటి సీపీ త్రివిక్రమ్ వర్మ మీడియా సమావేశంలో తేల్చి చెప్పారు. బెంగాల్ నుంచి సీఐడీ దర్యాప్తు చేపట్టిన తర్వాత అప్పటి కప్పుడు సెక్షన్లు మార్చారు. దర్యాప్తు అధికారిని తప్పించి ఉన్నతాధికారికి ఆ బాధ్యతలు అప్పగించారు. అలాగే సీఐ, ఎస్ఐలపై బదిలీ వేటు వేశారు. ఇపుడు మళ్లీ అప్పటి పోలీసుల వ్యవహార శైలిపై ప్రశ్నలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయన్న చర్చ పోలీస్ శాఖలోనే జరుగుతోంది.

జీవీఎంసీ జోన్ల సంఖ్య పెంపు

8 నుంచి 10 జోన్లగా మార్పు

దాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జోన్ల పునర్వ్యవస్థీకరణకు ఆమోదం లభించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న 8 జోన్‌లను 10 జోన్లుగా మార్పు చేసి వాటి వివరాలను ప్రకటించింది. ఆయా జోనల్ పరిధిలో వచ్చే వార్డులను కూడా తెలియజేసింది. జోన్–2, జోన్–9 పేర్లను స్థానిక గ్రామాల పేర్ల ఆధారంగా సవరిస్తూ భీమిలి–2 స్థానంలో మధురవాడ జోన్, పెందుర్తి–2 స్థానంలో అగనంపూడి జోన్‌గా నిర్ణయించింది. ఇకపై జీవీఎంసీ పరిధిలో భీమునిపట్నం, మధురవాడ, విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ, పెందుర్తి, గాజువాక, అగనంపూడి, అనకాపల్లి జోన్లు ఉంటాయని తెలిపింది. జీవీఎంసీలో సిబ్బందిని ఆయా జోన్‌ల్లో సర్దుబాటు చేయాలని పేర్కొంది. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ గురువారం ఉన్నతాధికారులతో సమావేశమై నూతన జోన్లకు కావాల్సిన కార్యాలయాలు, అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పరిపాలన సౌలభ్యం.. పారదర్శకత

ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలో 8 జోన్లు ఉన్నాయి. ఒక్కో జోన్ పరిధిలో 8 నుంచి 15 వార్డులు వరకు ఉన్నాయి. ఒక్కో జోన్ రెండు, మూడు నియోజకవర్గాలకు విస్తరించి ఉంది. దీంతో పరిపాలన సక్రమంగా ఉండడం లేదని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విధానాన్ని మార్పు చేయాలని దీర్ఘకాలంగా డిమాండ్ ఉంది. గత కౌన్సిల్ సమావేశంలో జోనల్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరణ చేయాలని పాలకవర్గం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదించగా 10 జోనల్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల పరిపాలన సౌలభ్యం, పారదర్శకతకు అవకాశం ఏర్పడనుంది. అలాగే ఒక నియోజకవర్గంలో ఉన్న వార్డులన్నీ ఒకే జోన్ పరిధిలోకి రానున్నాయి.

పునర్ వ్యవస్థీకరణ ఇలా..

క్రమ సంఖ్య	జోన్ పేరు	వార్డులు	మొత్తం విస్తీర్ణం (చ.కి.మీ)
1	భీమునిపట్నం జోన్	1, 2, 3, 4	58.884
2	మధురవాడ జోన్	5, 6, 7, 8, 98	95.668
3	తూర్పు జోన్	9, 10, 11, 12, 13, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 23, 28	48.527
4	ఉత్తర జోన్	14, 24, 25, 26, 42, 43, 44, 45, 46, 47, 48, 49, 50, 51, 53, 54, 55	19.928
5	దక్షిణ జోన్	27, 29, 30, 31, 32, 33, 34, 35, 36, 37, 38, 39, 41	9.698
6	పశ్చిమ జోన్	40, 52, 56, 57, 58, 59, 60, 61, 62, 63, 89, 90, 91, 92	72.937
7	పెందుర్తి జోన్	88, 93, 94, 95, 96, 97	75.038
8	గాజువాక జోన్	64, 65, 66, 67, 68, 69, 70, 71, 72, 73, 74, 75, 76, 86, 87	108.115
9	అగనంపూడి జోన్	77, 78, 79, 85	102.83
10	అనకాపల్లి జోన్	80, 81, 82, 83, 84	41.079

ఏసీబీకి చిక్కిన సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్

- సర్వే నెంబర్ మార్పు కోసం రూ.30 వేలు డిమాండ్
- నగదు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు


ఏసీబీకి పట్టుబడ్డ సర్వేయర్ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ నగేష్

మల్కాపురం: ఓ ఇంటి సర్వే నెంబర్ మార్పు కోసం రూ.30 వేలు లంచం తీసుకుంటున్న సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్‌లను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ములగాడ తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా రంగోలి సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్‌గా కర్రి నగేష్ పనిచేస్తున్నారు. ములగాడ మండల పరిధిలో బొడ్డేపల్లి రవితేజ అనే వ్యక్తి ఇంటికి సంబంధించి సర్వే నెంబర్ తప్పుగా వచ్చింది. దీంతో సదరు వ్యక్తి తన సర్వే నెంబర్ సరిచేయాలని ఇటీవల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్ ఇటీవల రవితేజ ఇంటికి వెళ్లి సర్వే చేశారు. సర్వే సర్టిఫికెట్ (ఎండార్స్‌మెంట్ సర్టిఫికెట్) కావాలంటే రూ.30 వేలు అవుతుందని డిమాండ్ చేశారు. ఆ డబ్బును ఇచ్చేందుకు పంజాబ్ దాబా జంక్షన్ వద్ద గల సచివాలయానికి రావాలని చెప్పారు. ఈక్రమంలో రవితేజ టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఏసీబీని ఆశ్రయించాడు. సదరు వ్యక్తి పంజాబ్ జంక్షన్ వద్ద సచివాలయానికి గురువారం సాయంత్రం వెళ్లి అక్కడ జూనియర్ అసిస్టెంట్ నగేష్, సర్వేయర్ సత్యనారాయణకు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ములగాడ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులు సర్వేయర్ రూమ్‌లో ఫైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో శుక్రవారం హాజరుపరచనున్నారు.

క్లుప్తంగా

పని గంటల పెంపుతో శ్రమశక్తి దోపిడీ

అనకాపల్లి: బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను నేటి పాలకులు కాలరాయడం అన్యాయమని, కార్మికుల 8 గంటల పనిదినాలను 12 గంటలకు పెంచడం శ్రమశక్తి దోపిడీ చేయడమేనని ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్ని యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిశ్రమలలో కార్మికుల పని గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ, శాసనమండలిలో చేసిన తీర్మానాలను తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. 13 సంవత్సరాలుగా కార్మికుడి కనీస వేతనాలను ప్రభుత్వం సవరించలేదని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల జీతాలను పెంచేలా ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



రోగులతో మాట్లాడుతున్న ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డి.డి.నాయుడు

అనకాపల్లి టౌన్: వర్షా కాలంలో వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ డి.డి.నాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిని గురువారం ఆయన సందర్శించి పలు వార్డులలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఆస్పత్రికి ఎక్కువగా జ్వరాలతో బాధపడుతున్న వారు వస్తున్నారని, వారందరికీ సత్వర వైద్య సేవలందిస్తున్నామన్నారు.

ఏటా వైద్య పరీక్షలు తప్పనిసరి



గ్రామస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అనకాపల్లి టౌన్: ఏడాదికి ఒకసారి 40 సంవత్సరాలు దాటిన వారంతా తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తుమ్మపాల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వాణి జగదీశ్వరీ పేర్కొన్నారు. మండలంలోని తుమ్మపాల 1, 2 గ్రామాల్లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు ఎదుర్కొనే పలు ఇబ్బందులు పరిష్కార మార్గాలు, వారు తీసుకోవలిసిన ఆహారం గురించి వివరించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 41 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	5,070
రెండో రకం	----	----
మూడోరకం	----	----

అనకాపల్లి సినిమాలు

రాజా	:ఓజీ
సత్యనారాయణ స్క్రీన్-1	:కిష్కింధపురం
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: ఓజీ
షిర్డిసాయి	: ఓజీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3, బీ పాజిటివ్-9, ఓ పాజిటివ్-19, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ.లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

వీధి వ్యాపారికి.. తీరని వేదన..!



చోడవరం రహదారిలో బడ్డీని జేసీబీ సహాయంతో తరలిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

- షాపులు, బడ్డీల తొలగింపుతో నడ్డి విరిచిన జీవీఎంసీ
- వారం రోజుల్లో మారిపోయిన బడుగుజీవుల ముఖచిత్రం
- హఠాత్ పరిణామంతో రోడ్డున పడ్డ చిరు వ్యాపారులు
- అప్పులతో పెనుభారం కానున్న కుటుంబ పోషణ
- ఉపాధి కోల్పోనున్న వేల మంది స్కిల్డ్ వర్కర్లు
- ప్రత్యామ్నాయంపై కనీసం దృష్టి సారించని అధికారులు

అనకాపల్లి: ఆపరేషన్ లంగ్స్ పేరిట జీవీఎంసీ చేపట్టిన ప్రధాన రహదారుల్లో షాపుల తొలగింపు అనకాపల్లి పట్టణంలోని బడుగు జీవుల ముఖచిత్రాన్ని ఒక్కసారిగా మార్చేసింది. దశాబ్దాలుగా ఈ షాపులపై ఆధారపడి జీవిస్తున్న వేల కుటుంబాలు హఠాత్ పరిణామంతో గగ్గోలు పెడుతున్నాయి. జీవీఎంసీ తమ బతుకుదెరువుపై కొట్టిందంటూ బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులు ఏం కావాలంటూ ఆవేదన చెందుతున్నారు. బడుగుల బతుకుతెరువుపై కనీస ఆలోచన లేకుండా జీవీఎంసీ తీసుకున్న తొలగింపుల నిర్ణయం మా పొట్టకొట్టిందంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో ఎటు చూసినా బాధితుల ఆవేదనలు, ఆర్తనాదాలే దర్శనమిస్తున్నాయి.

పట్టణ పరిధిలో చిరువ్యాపారులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా వారం రోజులుగా శారదానది బ్రిడ్జి నుంచి సుంకరమెట్ట జంక్షన్, పూడిమడక జాతీయ రహదారి నుంచి గుండాల జంక్షన్, రింగ్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో బడ్డీలు, తోపుడు బళ్లు, చిరువ్యాపారుల దుకాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగిస్తున్నారు. ఆపరేషన్ లంగ్స్ పేరిట బడుగు బలహీన వర్గాల వ్యాపారుల జీవితాల్లో కూటమి ప్రభుత్వం చీకటి నింపింది. ఫుట్‌పాత్‌లపై షాపులు, మూవింగ్ కౌంటర్స్ పెట్టుకుని పలువురు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. వీరిలో 70 శాతం మందికి పైగా ఏటా జీవీఎంసీకి పన్నులు కూడా చెల్లిస్తున్నారు. వీరంతా జీవీఎంసీ మంజూరు చేసిన స్ట్రీట్ వెండర్ కార్డ్, ట్రేడ్ లైసెన్స్‌లు కలిగి ఉన్నారు. ఎటువంటీ నోటీసులు ఇవ్వకుండా దుకాణాలను తొలగించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.



మెయిన్ రోడ్డులో ఎన్టీఆర్ క్రీడా మైదానం రహదారిలో బడ్డీలను తొలగించేందుకు వచ్చిన జేసీబీకి అడ్డంగా కూర్చున్న చిరు వ్యాపారులు

ఆరు రోజుల్లో అయోమయం

పట్టణ పరిధిలో సుమారుగా 400 బడ్డీలు, 1500 తోపుడుబళ్లు, 2 వేలకు పైగా రహదారులపై కూరగాయలు, ఇతర దుకాణాల వ్యాపారస్తులు ఆరు రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం జోనల్ పరిధిలో సుమారుగా 200 మందికి మాత్రమే చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇచ్చినట్లు జోనల్ అధికారులు చెబుతున్నారు. మూడు పొక్లెయిన్‌లు, నాలుగు లారీలు సహాయంతో బడ్డీలు, తోపుడు బళ్లు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను అధికారులు తొలగిస్తున్నారు. దీంతో చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారు.



షాపు ముందు ఆక్రమణను తొలగిస్తున్న దృశ్యం

బడ్డీలు తొలగించడం అన్యాయం



సుమారుగా 40 సంవత్సరాలుగా రైల్వే స్టేషన్ రహదారిలో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం నా వయస్సు 60 సంవత్సరాలు. ఒక్కసారిగా పాన్ షాప్‌ను తొలగించడంతో నా కుటుంబం రోడ్డున పడింది. ఇద్దరు పిల్లలకు వివాహం చేశాను. వారి జీవితాలు ఏమీ బాగోలేదు. అందరం పాన్‌షాప్‌పైనే ఆధారపడి జీవిస్తున్నాం. – భీశెట్టి సావిత్రి, రైల్వే స్టేషన్ రహదారి

ఉద్యోగం రాక టిఫిన్ కొట్టు పెట్టుకున్నా..



డిగ్రీ వరకు చదివా. ఉద్యోగం రాకపోవడంతో రింగ్ రోడ్డులో 30 సంవత్సరాలుగా చిన్నపాటి టిఫిన్ కొట్టు పెట్టుకుని కుటుంబంతో జీవిస్తున్నాం. ఈ షాపే ఆధారం. ఉన్నట్టుండి తొలగించడంతో రోడ్డు పడ్డాం. – **కొణతాల లీలావతి**, రింగ్‌రోడ్డు, అనకాపల్లి

జీవితం తలకిందులు చేశారు..



వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు తోడుగా ఉంటూ నా కుటుంబాన్ని పోషించుకునేందుకు చిన్నపాటి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నాను. దీనిపై ఆధారపడి ఆరుగురు జీవిస్తున్నాం. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఒక్కసారిగా జోనల్ అధికారులు వచ్చి తొలగించారు. సామాన్లు తీసుకునేందుకు సమయం కూడా ఇవ్వలేదు. విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. నిమిషాల వ్యవధిలో షాపును పీకేశారు. జీవితాన్ని తలకిందులు చేసేశారు. – **పప్పల వెంకట గణేష్**, రింగ్ రోడ్డు, అనకాపల్లి

ఓటేసి గెలిపించినందుకు బుద్ధొచ్చింది..



కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి గెలిపించుకుని మా నేత్రాలను మేమే పొడుచుకున్నాం. మాలాంటి చిరువ్యాపారులకు జోనల్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చూపించకుండా ఉన్నఫలంగా షాపులు తీసేయడం దారుణం. చంద్రబాబు పాలనలో ఎప్పుడు చిరువ్యాపారులకు ఇబ్బందులు తప్పవని మరోసారి తెలుసుకున్నాం. చిరు వ్యాపారులను ఇబ్బందులు పెట్టిన ప్రభుత్వాలు చరిత్రలో ఎక్కడ నిలబడలేదు. – **మారిశెట్టి లక్ష్మి**, చిరువ్యాపారి, అనకాపల్లి

డైలీ ఫైనాన్స్ ఎలా కట్టాలి..



సుమారుగా 40 సంవత్సరాలుగా తోపుడు బండిపై బట్టల వ్యాపారం చేస్తున్నాం. తండ్రి వారసత్వంగా 15 ఏళ్లగా చేస్తున్నాను. డైలీ ఫైనాన్స్ తీసుకుని షాపు నిర్వహిస్తున్నా. బట్టలు వ్యాపారం చేసుకోవద్దని తోపుడు బండిని తొలగించారు. దీంతో డైలీ ఫైనాన్స్ ఎలా కట్టాలి? కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదు. – **సీహెచ్.గురుమూర్తి**, బట్టల దుకాణం, అనకాపల్లి

క్రెబ్స్ పరిశ్రమ కార్మికుల ఆందోళన



తేగాడ వద్ద క్రెబ్స్ పరిశ్రమలో నిర్వహిస్తున్న కార్మికుల ఆందోళన

కశింకోట: తేగాడ గ్రామం వద్ద ఉన్న క్రెబ్స్ బయో కెమికల్ పరిశ్రమలో లే-ఆఫ్‌ను ఎత్తి వేసి, పరిశ్రమను తక్షణమే తెరిపించాలని ప్రభుత్వాన్ని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు ఎ.వి.అప్పారావు, కార్యదర్శి బాబూరావు మాట్లాడుతూ క్రెబ్స్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా శుద్ధి చేయకుండా వ్యర్థాలను విడిచిపెడుతుందని ఆరోపిస్తూ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నోటీసులు ఇచ్చి పరిశ్రమను ఐదు నెలల క్రితం మూసి వేశారన్నారు. దీని వల్ల సుమారు 350 మంది కార్మికుల కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పరిశ్రమలు, లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రచారం చేస్తుందని, ఉన్న పరిశ్రమను మాత్రం మూసి వేసి 350 మంది కార్మికుల పొట్టకొట్టిందని విమర్శించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని పరిశ్రమ తెరిపించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అప్పారావు, కన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి బోనాల ఊరేగింపు



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

కశింకోట: కశింకోటలో గురువారం సాయంత్రం సత్తెమ్మతల్లి బోనాల(ఘటాల) ఊరేగింపు ఘనంగా జరిగింది. అత్యధిక మంది మహిళలతో పాటు పురుషులు బోనాలు తలపై పెట్టుకొని స్థానిక కస్పా వీధి నుంచి పెద్ద ఊరేగింపుగా బయలుదేరారు. అక్కడి నుంచి పెద్ద బజారు, గవరపేట మీదుగా కనక మహాలక్ష్మి వీధి వరకు ఈ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా చెట్టు భజనలు, డప్పులతో బాణసంచా కాలుస్తూ అమ్మవారిని ఊరేగించారు. ప్రజలు దారి పొడవునా బిందెలతో రోడ్డుపై నీరు పోసి అమ్మవారికి భక్తి పారవశ్యంతో ఆహ్వానం పలికారు. కనక మహాలక్ష్మి ఆలయం నుంచి పిసినికాడ వద్ద ఉన్న సత్తెమ్మతల్లి ఆలయానికి బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి నివేదించి పూజలు చేశారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు

అనకాపల్లి: ప్రత్యామ్నాయం చూపకుండా జోనల్ పరిధిలోని చిరు వ్యాపారులపై జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించడం దారుణమని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డులో ఉన్న వ్యాపారులను తొలగిస్తున్న సమయంలో బాధితులకు గురువారం మద్దతుగా నిలిచారు. షాపింగ్ మాల్స్‌లో సెల్లార్లను ఖాళీ చేయించిన తరువాత చిరు వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్నారు. చిరు వ్యాపారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగించడం అన్యాయమన్నారు. సుమారు 40, 50 సంవత్సరాల నుంచి వ్యాపారాలు చేసుకుంటున్న వారి జీవనోపాధిని దెబ్బ తీయడం దారుణమన్నారు. బాధితులకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆర్థిక నష్టం కలిగిందన్నారు. వీరందరికీ తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదవాడికి ఏ కష్టం కూడా రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ 84వ వార్డు ఇంచార్జ్ కోరుకొండ రాఘవ, పార్టీ నేతలు మున్నూరు శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్వాసితులకు నాలుగు రెట్లు పరిహారం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: రాజుపాలెం రహదారిలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంతో ప్లాట్స్, గృహాలు కోల్పోయిన నిర్వాసితులకు గజాల్లో లెక్కించి, నాలుగు రెట్లు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. కేఎస్ఆర్ పేటలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వాసితులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజుపాలెం సర్వే నంబరు 61, 62లో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి భూములు స్వీకరిస్తున్నారని, మార్కెట్ రేటు కంటే తక్కువగా ఇస్తామనడం దుర్మార్గమన్నారు. గజాల్లో లెక్కించవలసిన భూమికి కూడా సెంట్లలో లెక్కించి నష్టపరిహారం నిమిత్తం ప్రతిపాదనలను రెవెన్యూ అధికారులు రైల్వే బోర్డుకు పంపించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పుదానికి నిర్వాసితులు నష్టపోతున్నారని, ఇప్పటికైనా సమగ్ర సర్వే చేసి తగు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ప్రకారం ఒక గజం స్థలం రూ.8 వేలు ఉందని, బయట మార్కెట్లో రూ.25 వేలు అమ్మకాలు సాగుతున్నాయన్నారు. తప్పుడు ప్రతిపాదనలను సరిదిద్దాలని, నిర్వాసితులకు ఇళ్ల స్థలంతో పాటు, కుటుంబంలో ఒకరికి రైల్వేలో ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సిరసపల్లి సన్యాసిరావు, మాజీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, బాధితులు గైపూరి భాస్కరరావు, చేబోలు దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

అచ్యుతాపురం రూరల్ : మహిళలు క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణులు కె.శ్రావ్య, ఐ.లిఖిత సూచించారు. గురువారం మడుతూరు గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య రక్షణ కోసం ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోటూరు శ్రీవేణి, లోవ కుమారి, కంటి వైద్యులు వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది అప్పలకొండ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ కనువిందు



కొల్లూరు మూకాంబిక దేవి అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ



కనకమహాలక్ష్మి వీధిలో సింహ వాహనంపై కొలువైన దుర్గాదేవి



అన్నపూర్ణదేవిగా కన్యకా పరమేశ్వరి అమ్మవారు



గౌరీపంచాయితన ఆలయంలో గజలక్ష్మీదేవిగా..



కనక దుర్గ ఆలయంలో కాత్యాయనీదేవిగా..



కాత్యాయనీదేవిగా సర్వమంగళాంబ



రాజరాజేశ్వరిదేవి అలంకరణలో నిదానం దొడ్డి కామాక్షి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



నూకాంబిక అమ్మవారికి సహస్ర కమల అర్చన నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి: దసరా ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం దుర్గాదేవి అమ్మవారు పలు అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సతకంపట్టు కనకదుర్గమ్మవారు భక్తులకు కొల్లూరు మూకాంబిక దేవిగా దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి చంద్రశేఖర్, భోగారపు వెంకటరమణ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భవానీ భక్తులకు అన్నదానం చేశారు.

- స్థానిక నిదానందొడ్డి కామాక్షిదేవి అమ్మవారు.. రాజరాజేశ్వరి దేవిగా దర్శనమిచ్చారు.
- స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి తోమాల సేవ సహస్ర కమలార్చన వంటి కార్యక్రమాలు జరిపారు. వ్యాపారవేత్త రొంగలి శ్రీనివాసరావు, పద్మావతి, జగన్నాథరావు పూర్ణిమ, నవీన్‌కుమార్ రూప దంపతులు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.
- స్థానిక మెయిన్ రోడ్డు కన్యకాపరమేశ్వరి అమ్మవారు.. అన్నపూర్ణదేవి అలంకరణలో కనువిందు చేశారు.
- స్థానిక గౌరీపంచాయతీ దేవాలయంలో గౌరీదేవి గజలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 108 రూపాయి నాణేలతో సహస్ర నామ పూజలు చేశారు.

కశింకోట: స్థానిక కనకదుర్గమ్మ, శివాలయంలో ఉన్న సర్వమంగళాంబను కాత్యాయనిదేవిగా అలంకరించారు. కనక మహాలక్ష్మి వీధిలోని రామాలయంలో నెలకొల్పిన సింహంపై కొలువై ఉన్న దుర్గాదేవికి భవానీ భక్తులు నిత్య పూజలు నిర్వహించారు. పెద్దబజారు వద్ద ఉన్న దుర్గాదేవి విగ్రహం వద్ద బుధవారం రాత్రి అంబలం పూజ చేశారు. తాళ్లపాలెంలో దుర్గమ్మ గరగల ఊరేగింపు ఘనంగా జరిగింది. దుర్గాలమ్మపేటలో వెలసి ఉన్న దుర్గమ్మ ఆలయం నుంచి గరగలను, బాణసంచా కాలుస్తూ ఊరేగించారు.

బల్క్‌డ్రగ్ పార్కును తక్షణమే రద్దు చేయాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్క్‌ను తక్షణమే రద్దు చేయాలని మత్స్యకారులు పెద్ద ఎత్తున నిరసనలు చేస్తుంటే, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు చీమకుట్టినట్టయినా లేకుండా పోయిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శంకరరావు అన్నారు. ఈ మేరకు మత్స్యకారులకు మద్దతుగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. సీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ జిలా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మత్స్యకారులకు మద్దతు ఇచ్చేందుకు వెళ్తున్న సమయంలో యలమంచిలి పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడం అన్యాయమన్నారు. ప్రశ్నించే వ్యక్తులను అరెస్టులు చేయడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. మత్స్యకారులు శాంతియుతంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని నిరసన తెలియజేస్తుంటే ప్రజల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం పోలీసులతో బంధించి, కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ప్రతిపక్షంలో ఉన్న అప్పటి చంద్రబాబు బల్క్‌డ్రగ్ పార్కు ప్రమాదకరమని దీనిపై పోరాటాలు చేయాలని చెప్పి, సీఎంగా చంద్రబాబు గద్దెనెక్కిన తరువాత బల్క్‌డ్రగ్ పార్కును ఏర్పాటు చేయాలని చర్యలు తీసుకోవడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. బల్క్ డ్రగ్ పార్క్‌తో మత్స్యకారుల జీవనోపాధి, స్థానిక ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పార్క్ నిర్మాణంతో సముద్ర కాలుష్యం పెరిగి మత్స్య సంపద నాశనం అవుతుందన్నారు. అభివృద్ధి పేరిట ప్రజల పునరావాసం, జీవన భద్రతలను పక్కన పెట్టి, కార్పొరేట్ లాభాల కోసం మాత్రమే కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యుడు అల్లు రాజు, పార్టీ నాయకులు గండి నాయనబాబు, కె.తేల్లయ్యబాబు, కె.ఈశ్వరరావు, పి.చలపతి, నూకఅప్పారావు, పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.